# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 08 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## కన్నడ బిగ్ బాస్ స్టూడియో మూసివేయండి

- కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కన్నడ సూపర్ స్టార్ కిచ్చా సుదీప్ హోస్ట్ గా వ్యవహరిస్తున్న ప్రముఖ రియాలిటీ షో 'బిగ్ బాస్' కు ఊహించని షాక్ తగిలింది. పర్యావరణ, కాలుష్య నియంత్రణ నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలతో, షో చిత్రీకరిస్తున్న స్టూడియోను తక్షణమే మూసివేయాలని కర్ణాటక రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (కేఎస్ పీసీబీ) మంగళవారం సంచలన ఆదేశాలు జారీ చేసింది.బెంగళూరు శివార్లలోని రామనగర జిల్లా, బిడదిలో ఉన్న 'జాలీవుడ్ స్టూడియోస్ అండ్ అడ్వెంచర్స్' ప్రాంగణంలో ఈ షో చిత్రీకరణ జరుగుతోంది. స్టూడియోకు విద్యుత్ సరఫరాను తక్షణమే నిలిపివేయాలని బెస్కామ్ (బెంగళూరు ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ) మేనేజింగ్ డైరెక్టర్‌కు కేఎస్ పీసీబీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ మూసివేత అమలులో ఉంటుందని పేర్కొంది. ఈ పరిణామంపై రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే స్పందించారు. "నిబంధనల ఉల్లంఘనపై పలుమార్లు నోటీసులు జారీ చేసినా వారు పట్టించుకోలేదు. చట్టం ముందు ఎవరూ గొప్పవారు కాదు. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన స్పష్టం చేశారు.

# అన్నీ హైకోర్టుకు నివేదిద్దాం..



- వాదనలు బలంగా వినిపిద్దాం
- రాజకీయంగానే రాష్ట్రపతి, గవర్నర్ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు
- మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి ముందస్తు సమాలోచనలు
- బీసీ రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ
- న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, సిద్దార్థ దవేకు పిలుపు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

'బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కామారెడ్డి డిక్లరేషన్ మొదలుకుని అసెంబ్లీలో తీర్మానం వరకూ పార్టీ తరపున, ప్రభుత్వం తరపున చేసిన అన్ని ప్రయత్నాలనూ హైకోర్టుకు నివేదిద్దాం...' అని ముఖ్యమంత్రి రేవంత్... మంత్రివర్గ సహచరులకు, కాంగ్రెస్ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ట్రిబుల్ టెస్ట్ (సామాజిక ఆర్థిక కులగణన సర్వే, డెడికేషన్ కమిషన్ ఏర్పాటు,జీవో విడుదల) కూడా పాసయ్యామంటూ న్యాయస్థానానికి విడమరిచి చెప్పాలని ఆయన సూచించారు. సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్ల పిటిషన్ కొట్టేసిన సంగతి విదితమే. కాగా బుధవారం ఈ అంశం హైకోర్టులో విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్ మంత్రులు, కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. రిజర్వేషన్లపై హైకోర్టులో తీర్పు ఏ విధంగా రావచ్చు? అది అనుకూలంగా వస్తే ఏం చేయాలి? ప్రతికూలమైతే ఎలా స్పందించాలి? అనే అంశాలపై సీఎం ఈ సందర్భంగా వారితో సుదీర్ఘంగా సమాలోచనలు చేశారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను అమలు చేసేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందనే విషయాన్ని కోర్టుకు నివేదించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ మేరకు బలమైన వాదనలు వినిపించేందుకు వీలుగా సుప్రీంకోర్టులో కేసును వాదించిన న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, సిద్దార్థ దవేలను రప్పించాలని కోరారు. రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక కుల గణన, దాంతోపాటు డెడికేషన్ కమిషన్ ఏర్పాటు, అనంతరం అసెంబ్లీలో తీర్మానించిన విషయాలను న్యాయస్థానం దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. ఆ మేరకే జీవో ఇచ్చిన విషయాన్నీ ప్రస్తావించారు. ఇదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో రిజర్వేషన్ల అమలు విధానాన్ని ఏకరువు పెట్టాలన్నారు. తాము ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి కులగణనను చేపట్టామనీ, తదనుగుణంగా రిజర్వేషన్లకు ఆమోదముద్ర వేయాలంటూ కేంద్రాన్ని, రాష్ట్రపతిని కోరామని తెలిపారు. అయితే రాజకీయంగా తమను ఇరుకున పెట్టేందుకే అటు రాష్ట్రపతిగానీ, ఇటు ప్రధానిగానీ అపాయింట్‌మెంట్ ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ గవర్నర్ కూడా ఇదే రకంగా వ్యవహరించటం శోచనీయమన్నారు. మరోవైపు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవటం మూలాన కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, గ్రాంట్లు, ఇతర సాయాలు నిలిచిపోయాయని సీఎం రేవంత్ గుర్తు చేశారు. దీంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలన్నింటినీ సింఘ్వీ, దవే ప్రభుత్వం తరపున హైకోర్టు ముందుంచటం ద్వారా బలమైన వాదనలు వినిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందనే అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. దీంతో సీఎం ఏకీభవించినట్టు తెలిసింది. ఒకవేళ తీర్పు ప్రతికూలంగా వస్తే ఏం చేయాలనే దానిపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అలాంటప్పుడు బీసీల ప్రయోజనాల కోసం అవసరమైతే సుప్రీంకోర్టు గడప తొక్కటానికి కూడా వెనుకాడొద్దంటూ రేవంత్ సూచించినట్టు అధికార పార్టీ వర్గాలు తెలిపాయి. మొత్తం మీద బుధవారం వెలువడబోయే హైకోర్టు తీర్పు కోసం కాంగ్రెస్ పార్టీ, రేవంత్ సర్కారు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. ప్రజల్లో కూడా ఇది తీవ్ర చర్చనీయాంశం కానుంది.

## హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం




- టూరిస్టు బస్సుపై కొండచరియలు విరిగి 18 మంది మృతి

బలగం టీవీ, బిలాస్‌పూర్

హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో ఆదివారం ఉదయం ఘోర విషాదం చోటుచేసుకుంది. కొండచరియలు విరిగి టూరిస్టు బస్సుపై పడడంతో 18 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. బస్సులో 30 నుంచి 35 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకుపోయినట్లు తెలిసింది. రక్షణ చర్యలు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి.

హరియాణా రాష్ట్రం రోహ్‌తక్ నుంచి హిమాచల్‌లోని ఘుమర్విన్‌కు బయలుదేరిన ప్రైవేట్ టూరిస్టు బస్సు, ఝండూతా నియోజకవర్గ పరిధిలోని బలూఘాట్ ప్రాంతం చేరుకోగానే ఈ ప్రమాదం జరిగింది. కొండచరియలు ఒక్కసారిగా విరిగి బస్సుపై పడ్డాయి. క్షణాల్లోనే వాహనం శిథిలాల కింద పూర్తిగా మునిగిపోయింది. అధికారులు, పోలీసు బృందాలు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని శిథిలాల తొలగింపు పనులు ప్రారంభించారు. ఇప్పటికే పలువురిని ప్రాణాలతో రక్షించినట్లు సమాచారం. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు.

**ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు స్పందన**

ఈ ఘటనపై హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "బిలాస్‌పూర్‌లో జరిగిన ఈ ఘటన చాలా విషాదకరం. కొండచరియల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు పూర్తి యంత్రాంగాన్ని మోహరించాలని ఆదేశించాను. రెస్క్యూ ఆపరేషన్‌పై నేరుగా సమీక్షిస్తున్నాను," అని సీఎం సుఖు తెలిపారు.

**రాష్ట్రపతి, ప్రధాని సంతాపం**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "బిలాస్‌పూర్‌లో జరిగిన ఈ ఘోర ప్రమాదం మనసును కలచివేసింది. మరణించిన వారి కుటుంబాలకు నా సంతాపం తెలియజేస్తున్నాను," అని రాష్ట్రపతి ముర్ము ట్వీట్ చేశారు.

ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేస్తూ, ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుండి ఆర్థిక సాయం ప్రకటించారు. "ప్రతి మృతుని కుటుంబానికి ?2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి ?50,000 అందజేస్తాం," అని మోదీ తెలిపారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బృందాలు ఘటనా స్థలంలో సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి," అని తెలిపారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా సంతాపం తెలుపుతూ, బాధిత కుటుంబాలకు మద్దతు ప్రకటించారు. బిలాస్‌పూర్ విషాదం దేశాన్ని కుదిపేసింది. కొండచరియల ముప్పు ఉన్న ప్రాంతాల్లో పర్యాటక రాకపోకలపై అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.



## ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య

- నల్లగొండ జిల్లా కేంద్రలో ఘటన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ విద్యార్థిని దారుణహత్యకు గురైన సంఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల సమీపంలో మంగళ వారం జరిగింది. కాగా నిందితుడు బాలికపై లైంగికదాడికి పాల్పడి హత్య చేశాడన్న అనుమానాలు వస్తున్నాయని మృతురాలి బంధువులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలంలోని అన్నారెడ్డి గూడెంకు చెందిన ఇందూ(17) నల్లగొండ జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతుంది. గుట్టకింద అన్నారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గడ్డం కృష్ణగౌడ్‌తో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. వీరు ఆరునెలలుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో బాలికను మంగళవారం కృష్ణగౌడ్ తన మిత్రుడు (ఓ ఆటోడ్రైవర్) రూమ్‌కు తీసుకెళ్లాడు. ఇద్దరి మధ్య ఘర్షణ జరగగా గడ్డం కృష్ణ విద్యార్థినిని హత్య చేసి డైట్ కళాశాల సమీపంలో పడేశాడు. కాగా తల్లిదండ్రులు మాత్రం తమబిడ్డపై లైంగికదాడి చేసి హత్య చేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిందితుడు గడ్డం కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. ఘటనాస్థలాన్ని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, వన్ టౌన్ సీఐ వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్‌లో మంత్రి తెచ్చిన రచ్చ





- మంత్రి లక్ష్మణ్‌పై మంత్రి పొన్నం అనుచిత వ్యాఖ్యలు
- ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు.. అధిష్టానానికి ఫిర్యాదు చేస్తా: అడ్లూరి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సహచర మంత్రిపై నోరు జారిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పి తెచ్చి పెట్టారు. సమావేశానికి సమయానికి రాలేదన్న అసహనంతో దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఉద్దేశించి 'ఆ దున్నపోతుగానికేం తెలుసు' అంటూ బాడీ షేమింగ్‌పై చేసిన వ్యాఖ్యల వీడియో పుటేజీ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యాఖ్యలు మైక్‌లో రికార్డయి బయటకు రావడంతో వివాదం ఒక్కసారిగా భగ్గుమంది. ఇది కేవలం ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలకు దారితీసినా.. 'మాదిగల ఆత్మగౌరవం' చుట్టూ తిరుగుతూ కులం రంగు పులుముకుంది. మంత్రి లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, దళిత సంఘాలు క్షమాపణకు అల్టిమేటం జారీ చేయడంతో ఈ ఎపిసోడ్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతర్గత సంక్షోభానికి దారితీసింది. పొరపాటును అంగీకరించకుండా 'ఇది బీఆర్ఎస్ కుట్ర' అంటూ పొన్నం చెప్పడాన్ని మంత్రి అడ్లూరి, ఆయన అనుచరులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఇది పొన్నం అహంకార వైఖరికి నిదర్శనమనే అభిప్రాయం ఆ పార్టీలో వినిపిస్తోంది.

**అసలేం జరిగిందంటే..**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రహ్మత్ నగర్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ మీడియా సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే, మంత్రి లక్ష్మణ్ కాస్త ఆలస్యంగా రావడంతో పొన్నం ప్రభాకర్ అసహనానికి గురయ్యారు. పక్కనే ఉన్న మంత్రి వివేక్ చెవిలో 'మనకు టైం అంటే తెలుసు.. జీవితమంటే తెలుసు.. వారికేం తెలుసు.. ఆ.. దున్నపోతు గానికి' అని గుసగుస లాడారు. మైకులు ఆన్‌లో ఉండటంతో ఈ వ్యాఖ్యలు స్పష్టంగా రికార్డయ్యాయి. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వివాదం మొదలైంది. ఇది కేవలం లక్ష్మణ్‌కు జరిగిన అవమానం కాదని, మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఎమ్మార్పీఎస్ వంటి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

**అయితే** మంత్రి పొన్నం ప్రభాకర్... తన వ్యాఖ్యలను వక్రీకరించారని, ఇదంతా బీఆర్ఎస్ సోషల్ మీడియా చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. 'అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పీసీసీ అధ్యక్షులు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్' అని చెప్పడం ద్వారా ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని చూశారు. అయితే, ఆయన వైఖరి.. సమస్యను మరింత జఠిలం చేసింది. కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయకపోవడం పొన్నం అహంకారానికి నిదర్శనమని, ఆయనలోని దురుసుతనాన్ని ఇది బయటపెట్టిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

### అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తా

- ఆయన మారకపోతే జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్

పొన్నం వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు. 'జరిగిన పొరపాటును ఒప్పుకొని క్షమాపణ చెబితే పొన్నంకు గౌరవం ఉంటుంది. మాదిగలు అంటే అంత చిన్న చూపా?' అని ఆయన ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నం తన తప్పు తెలుసుకుంటాడని ఆశించానని, కానీ ఆయన మారకపోతే జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంతేకాకుండా, 'నేను మాదిగను కాబట్టే నాకు మంత్రి పదవి వచ్చింది. నేను మంత్రి కావడం, మా సామాజిక తరగతిలో పుట్టడం తప్పా?' అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. మంత్రి వివేక్ తన పక్కన కూర్చోవడానికి కూడా ఇష్టపడటం లేదని, ఇది ఎంతవరకు సమంజసమని ఆయన వాపోయారు.




## రెండేండ్లలో తుమ్మడిహట్టి బ్యారేజ్

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- జలశక్తి మంత్రి ఉత్తమ్, పైస్థాయి అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు


బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం నిల్వల జలవనరుల పనులను సమయపరిమితి, సంస్థాగత బాధ్యత మరియు సాంకేతిక పారదర్శకతతో పూర్తి చేయడంపై అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని జలశక్తి, సివిల్ సప్లైస్ మంత్రివర్యులు కెప్టెన్ ఎన. ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులతో ఇవాళ(మంగళవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రాణహిత %-% చెవెళ్ల ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉద్ఘాటించారు. తుమ్మడిహట్టి వద్ద రెండు ప్రత్యామ్నాయ మార్గాలపై పరిశీలిస్తున్నట్లు చెప్పుకొచ్చారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నొక్కిచెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీల పునరుద్ధరణలో ఐఐటీని భాగస్వామ్యం చేస్తామని వెల్లడించారు. వర్షాకాలం అనంతరం రూపకల్పన చేసి ఒక సంవత్సరంలో వీటిని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అలాగే, కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ -విచారణ పురోగతిపై సమీక్షించారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. సమ్మక్క సారక్క ప్రాజెక్టు, దేవదుల ప్రాజెక్టులపై సమీక్షించారు. భూ సేకరణ పరిహారంగా రూ.33 కోట్లు విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు.

## నాలుగు రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం

- కేంద్ర మంత్రి వర్గ నిర్ణయం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



నాలుగు రాష్ట్రాల్లో నాలుగు రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంగళవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశం నిర్వహిం చారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రా ల్లోని 18 జిల్లాల పరిధిలో నాలుగు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టు లకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు వల్ల దాదాపు 894 కిలో మీటర్ల రైల్వే నెట్‌వర్క్ పెరుగుతుందని పేర్కొంది. 2030-31 నాటికల్లా పూర్తవనున్న ఈ ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ. 24,634 కోట్లుగా తెలిపింది. మహారాష్ట్రలోని వార్ధా - భూసావాల్ - మూడు, నాలుగు లైన్ - 314 కిలోమీటర్లు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో గోండియా - డోంగర్ గఢ్ - నాలుగో లైన్ - 84 కిలోమీటర్లు, గుజరాత్, మధ్య ప్రదేశ్‌లో వడోదర - రత్లాం - మూడో, నాలుగో లైన్ - 259 కిలోమీటర్లు, మధ్యప్రదేశ్‌లో ఇటార్సీ - భోపాల్ - బీనా నాలుగో లైన్ -237 కిలోమీటర్లు నిర్మిస్తారు.

## ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ఉచిత బస్సు పథకంతో ఆటో నడవక, ఉపాధి లేక కుటుంబ పోషణ భారంగా మారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సిరిసిల్ల నియోజకవర్గం, అడవి పదిరకు చెందిన ఆటో డ్రైవర్ సతీశ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వైఖరితో ఉపాధి లేక రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఆటో డ్రైవర్లు అవస్థలతో కొట్టుమిట్టాడుతున్నారు అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే 93 మందికి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకొని చనిపోయారు.. చనిపోయిన ప్రతి ఆటో కార్మికుని కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం తక్షణమే ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒక్కొక్క ఆటో డ్రైవర్‌కి రూ. 24 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడింది. ఆటో డ్రైవర్ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోంది. పార్టీలకు అతీతంగా ఆటో డ్రైవర్ సంఘాలన్నీ, డ్రైవర్లందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాను, ప్రభుత్వం మెడలు వంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లు ఎవరు కూడా ఆత్మస్థైర్యం కోల్పోవద్దు, ధైర్యంగా ఉండాలి, జీవితం విలువైంది. కష్టం వచ్చిన ఆటో డ్రైవర్ అన్నల వెంబటి బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది అని కేటీఆర్ భరోసా ఇచ్చారు.


## 'దేశంలో అత్యున్నత స్థాయికి అసహనం'

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించటాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది వ్యక్తిపై దాడి కాదని, వ్యవస్థపైనే దాడి అంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మన దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుంది. దీనికి నిన్న సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి జరగడం ఒక దారుణమైన సంకేతం. ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడి యత్నాన్ని తీవ్రంగా, నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నా. న్యాయవ్యవస్థ గౌరవంపై జరిగిన ఈ సిగ్గుచేటైన దాడి కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు, ఆ వ్యవస్థపైనే జరిగిన దాడి. విశ్వాసం వంటి సున్నితమైన అంశాలపై ఎలాంటి విభేదం ఉన్నా కూడా హింసను సమర్థించదు. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు కలిగిస్తుంది' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్


బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో




ఈ ఏడాది భౌతిక శాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి లభించింది. అనేక కణాలతో కూడిన క్వాంటమ్ టన్నెలింగ్‌ను మాక్రో స్కోపిక్ స్కేలుపై ఎలా పరిశీలించవచ్చు అనే అంశంపై జాన్ క్లార్క్, మైఖేల్ డివొరెట్, జాన్ మార్టినిస్‌లు సాగించిన పరిశోధనకు గానూ ఈ పురస్కారం లభిం చింది. 'ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో మాక్రోస్కోపిక్ క్వాంటమ్ మెకానికల్ టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌లో ఆవిష్కర ణలకు గానూ ఈ పురస్కారం అందచేస్తున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఒక ప్రకటనలో పేర్కొంది. శతాబ్ద కాలం నాటి క్వాంటమ్ మెకానిక్స్‌లో ఇంకా కొత్తగా ఆశ్చర్యచకితులను చేసే అంశాలను కనుగొనడం అద్భుతమైన విషయమని పేర్కొంది. డిజిటల్ సాంకేతికతకు క్వాంటమ్ మెకానిక్స్ పునాది అయినందున దీనివల్ల అపారమైన ఉపయోగాలు వున్నాయని భౌతిక శాస్త్రంలో నోబెల్ కమిటీ చైర్మన్ ఓలె ఎరిక్సన్ పేర్కొన్నారు.

## సమ్మక్క-సరక్కా సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ లోగో ఆవిష్కరణ

బలగం టీవీ, న్యూఢిల్లీ



కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రాధాన్, కేంద్ర కోల్ మంత్రి జి. కిషన్ రెడ్డి ములుగు సమ్మక్క-సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ అధికారిక లోగోను న్యూఢిల్లీ లోని ఉపకళాప్రధానుల సమక్షంలో మంగళవారం ఆవిష్కరించారు. లోగోలో వివిధ ? భాషల పదాలను చేర్చడం ద్వారా యూనివర్సిటీ సృజనాత్మకతను, వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా రూపొందించబడింది. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, "యూనివర్సిటీ సమ్మక్క, సరలమ్మల పేర్లతో నామకరణం చేయబడినందుకు కోట్ల భక్తుల విశ్వాసం మరియు తెలంగాణా సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవిస్తున్నది" అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ కోసం భూమి కేటాయించిన నేపథ్యంలో, ప్రాధాన్ కి భవనాల నిర్మాణం వేగంగా చేపట్టాలని సూచించారు. ప్రాధాన్ పేర్కొన్నారు, కేంద్రం ట్రైబల్ విద్యపై ప్రత్యేక కట్టుబడి ఉంది మరియు యూనివర్సిటీ కోసం ఇప్పటికే 800 కోట్ల రూపాయలపైగా నిధులు కేటాయించబడ్డాయి. ఆయన పేర్కొన్నారు, "ఈ సంస్థ కేవలం తెలంగాణకే కాక, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి పొరుగుదేశాల్లోని ట్రైబల్ కమ్యూనిటీలకు కూడా సేవ చేస్తుంది."

# 3 లక్షలు అప్పు చేసి బైక్ కొనిచ్చిన తల్లిదండ్రులు

- **కడుపుకోత మిగిల్చిన కుమారుడు..**

**బలగం టీవీ, విశాఖపట్నం**



అప్పు చేసి కొనిచ్చిన కొత్త బైక్ తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. బైక్ ప్రమాదంలో యువకుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. ఈ ఘటన విశాఖపట్నం నగరంలో జరిగింది. విశాఖపట్నం మహారాణిపేటలో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు (ఆటో డ్రైవర్) కుమారుడు హరీష్ (19) ఇంటర్ వరకు చదివి ఖాళీగా ఉంటున్నాడు. ఈ దసరాకు బైక్ కావాలని తల్లిదండ్రులను అడిగాడు. మొదట డబ్బుల్లేవని తండ్రి నిరాకరించినప్పటికీ, హరీష్ మొండిపట్టు పట్టి అలగడంతో, చివరికి శ్రీనివాసరావు కుమారుడి సంతోషం కోసం రూ. 3 లక్షలు అప్పు చేసి దసరా రోజున బైక్ కొనిచ్చాడు.

బైక్ కొన్న మరుసటి రోజు, హరీష్ తన స్నేహితుడు వినయ్‌తో కలిసి టిఫిన్ చేయడానికి కొత్త బైక్‌పై ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లారు. టిఫిన్ చేసిన తరువాత, వినయ్‌ను ఇంటి వద్ద దించడానికి కాంప్లెక్స్ నుంచి బయలుదేరారు. బైక్‌ను మితిమీరిన వేగంతో నడుపుతూ సిరిపురం దత్ ఐలాండ్ మలుపు వద్దకు రాగానే, బైక్ అదుపు తప్పింది. దీంతో హరీష్ నడుపుతున్న బైక్ డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హరీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడున్నవారు 108 అంబులెన్స్‌లో హరీష్‌ను కేజీహెచ్ కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హరీష్ మరణించాడు. వెనకాల కూర్చున్న స్నేహితుడు వినయ్ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై మహారాణిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పు చేసి కొనిచ్చిన కొత్త బైక్ తమ కుమారుడిని బలి తీసుకుందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# జాతీయ న్యాయ విజ్ఞాన సదస్సుకు జిల్లా న్యాయవాదులు ఎంపిక

- **జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 8, 9 వ తేదీలలో న్యూ ఢిల్లీ లో నిర్వహించబడనున్న 'న్యాయ సహాయ డెలివరీ మెకానిజాన్ని బలోపేతం చేయడం'అంశంపై జాతీయ సదస్సు లో పాల్గొనుటకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఇద్దరు న్యాయవాదులు ఎంపిక కావడం జరిగిందని జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ తెలిపారు. ఈ సందర్భంగా రాధిక జైస్వాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ప్యానల్ అడ్వకేట్స్ మరియు పారాలీగల్ వాలంటీర్ల నుంచి ఇద్దరు చొప్పున ప్రతినిధుల పేర్లు కోరడం జరిగిందని అన్నారు జిల్లా ప్రధాన న్యాయమూర్తి .పి.నీరజ సూచనతో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ప్రతి విభాగంలో ఇద్దరి పేర్లు మరియు వారి పనితీరును పంపించడం జరిగిందని, అందులో నుండి ఈ.జ్యోతి, (అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్), ఆర్.అరుణ (ప్యానెల్ అడ్వకేట్) ఎంపిక కావడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన న్యాయవాదులు మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ ని మర్యాదపూర్వకంగా కలిశారు.



# కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు

**బలగం టీవీ, హైదరాబాద్**

జూబ్లీహిల్స్‌లో ఓటర్ కార్డులను పంపిణీ చేసిన కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్ మీద క్రిమినల్ కేసు నమోదైంది. ఎన్నికల సంఘం నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణల మీద అధికారులు ఈ చర్య తీసుకున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యగా దీనిని భావించిన ఎన్నికల సంఘం అధికారులు సీరియస్‌గా స్పందించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి రజినీకాంత్ రెడ్డి మధురా నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా, నవీన్ యాదవ్ మీద బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) సెక్షన్లు 170, 171, 174తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారనే కారణంతో ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# హైదరాబాద్‌లో మరోసారి ఐటీ సోదాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

నగరంలో మరోసారి ఆదాయపన్ను శాఖ (ఐటీ) అధికారులు దాడులు నిర్వహించారు. కొండాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. కొండాపూర్‌లోని అపర్ణ హోమ్స్‌లో నివసిస్తున్న వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. ఇదే సమయంలో మహబూబ్‌నగర్‌లో, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో కూడా ఐటీ అధికారులు దాడులు చేస్తున్నారు. పప్పు దినుసుల హోల్‌సేల్ వ్యాపారుల ఇండ్లలో, కర్నూలు జిల్లాలోని 'వీ సీడ్స్' కార్యాలయంలో, వినుకొండలోని దాల్ మిల్ వ్యాపారి ఇంట్లో తనిఖీలు కొనసాగుతున్నాయి.

# 'గ్రీన్ ఫీజు'.. ప్రయాణికుల జేబుకు మళ్లీ చిల్లు!

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నగర ప్రయాణికులకు మరోసారి భారంగా మారింది. పర్యావరణహిత రవాణా కోసం నిధులు సమకూర్చే ఉద్దేశంతో సోమవారం నుండి సిటీ బస్సు టిక్కెట్లపై 'గ్రీన్ ఫీజు' వసూలు చేయడం మొదలుపెట్టింది. ఈ అదనపు ఛార్జీల పెంపుతో ప్రయాణికుల జేబుకు మరోసారి చిల్లు పడింది.

సిటీ బస్సు టికెట్‌పై రూ.5 నుండి రూ.10 వరకు పెరిగింది. ఇది బస్సు రకం, ప్రయాణించే దూరం ఆధారంగా మారుతుంది. ఈ గ్రీన్ ఫీజు ద్వారా సంవత్సరానికి దాదాపు రూ. 110 కోట్లు ఆదాయం వస్తుందని టీజీఎస్‌ఆర్టీసీ అంచనా వేస్తోంది. టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు ఈ అదనపు ఛార్జీల పెంపును సమర్థిస్తూ, హైదరాబాద్‌లో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులకు మారడానికి ఈ నిధులు అవసరమని పేర్కొన్నారు. గ్రీన్ ఫీజు ద్వారా సేకరించిన డబ్బులను నగరం అంతటా ఎలక్ట్రిక్ బస్ డిపోలు మరియు ఛార్జింగ్ పాయింట్ల సదుపాయాలను నిర్మించడానికి ఉపయోగిస్తామని అధికారులు తెలిపారు. పట్టణ రవాణాను కాలుష్య రహితంగా మార్చడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ చెబుతున్నప్పటికీ, ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ఇబ్బంది పడుతున్న నగర ప్రజలపై ఈ ఛార్జీల భారం పడుతుందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టేందుకే 'బాకీ కార్డు'

- **మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు**

**బలగం టీవీ, హైదరాబాద్**



జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఇంటింటికీ 'బాకీ కార్డు' పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా మోసం చేసిందో ఈ కార్డుల ద్వారా వివరిస్తున్నామని తెలిపారు.

మీడియాతో మాట్లాడిన హరీష్ రావు.. కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ కార్డులను పంచి 22 నెలలైనా ఇప్పటివరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. "ఏ ఒక్క హామీ నెరవేర్చకపోయినా ప్రజలు అడగడం లేదని కాంగ్రెస్ అనుకుంటోంది. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ ఓడితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏమీ పడిపోదు. కానీ, ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నా, ప్రతి మహిళకు రూ. 2500 రావాలన్నా, వృద్ధులకు రూ. 4000 రావాలన్నా, యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కావాలన్నా, కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ బుద్ధి చెప్పాలి" అని ఆయన స్పష్టం చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని మాట తప్పిన కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్‌లో ఓడించడం ద్వారా బుద్ధి చెప్పాలని హరీష్ రావు ప్రజలకు పిలుపునిచ్చారు. "జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ఇచ్చిన హామీలు అమలు అవుతాయి. ఒకవేళ కాంగ్రెస్‌ను గెలిపిస్తే, 'మేము హామీలు అమలు చేయకపోయినా ప్రజలు ఏమనడం లేదనుకుంటారు'" అని ఆయన హెచ్చరించారు. మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం అంటే "మన వేలితో మన కన్నులు పొడుచుకోవడమే" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ డబ్బులని, అధికార దుర్వినియోగాన్ని నమ్ముకుందని, పోలీసుల ద్వారా గెలవాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజలు డబ్బుకో, మద్యం సీసాలకో అమ్ముడుపోవద్దని కోరుతూ, "రేవంత్ రెడ్డి ఇచ్చే డబ్బులు మీ ఎడమకాలితో తన్ని బీఆర్ఎస్‌ను గెలిపించాలని" విజ్ఞప్తి చేశారు.

దివంగత మాగంటి గోపీనాథ్ ప్రజలకు ఏ విధంగా సేవ చేశారో, తమ బీఆర్ఎస్ అభ్యర్థి సునీత కూడా అదేవిధంగా పేదల పక్షాన నిలబడతారని హరీష్ రావు తెలిపారు. గోపీనాథ్‌కు నిజమైన నివాళి ఇవ్వాలంటే సునీతను గెలిపించాలని కోరారు. మైనార్టీలను కాంగ్రెస్ తీవ్రంగా మోసం చేసిందని హరీష్ రావు విమర్శించారు. షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం హామీ ఇవ్వకుండా మోసం చేసిందని, కొడంగల్‌లో మసీదు, దర్గాను కూల్చివేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మైనార్టీలకు రూ. 4000 కోట్ల బడ్జెట్ పెడతామని చెప్పి, కనీసం రూ. 1000 కోట్లు కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. "బీఆర్ఎస్ మైనార్టీని హోం మంత్రిని చేసింది, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క ముస్లిం మైనార్టీకి మంత్రి పదవి ఇవ్వలేదు" అని పేర్కొన్నారు. ఇమామ్, మౌజమ్‌లకు జీతాలు పెంచుతామని మోసం చేసిన కాంగ్రెస్‌కు ముస్లింలు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

# ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

- **హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్**

**బలగం టీవీ, హైదరాబాద్**



నగరంలో డ్రైవింగ్ సమయంలో మొబైల్‌లో వీడియోలు చూస్తూ, ఇయర్‌ఫోన్స్ ధరించి వాహనాలు నడిపే వారిపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఈ విధమైన చర్యలు ప్రమాదకరమే కాకుండా శిక్షార్హమనన్నారు .

సజ్జనార్ మాట్లాడుతూ వాహనం నడపుతూ ఫోన్‌లో వీడియోలు చూడటం లేదా ఇయర్‌ఫోన్స్ వినడం వల్ల డ్రైవర్ దృష్టి రోడ్డుపై ఉండదు... ఇది ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. ఆటో రిక్షా, క్యాబ్, బైక్ టాక్సీలను నడుపుతున్న డ్రైవర్లు ఇలా చేస్తూ తరచుగా కనిపిస్తున్నారని చెప్పారు. వాహనాన్ని నడుపుతున్న సమయంలో ఫోన్ వాడటం వల్ల వారి దృష్టి రోడ్డుపై ఉండదని, ఇది ప్రాణాంతక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి నిర్లక్ష్య చర్యలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. డ్రైవర్, ప్రయాణికులు, రోడ్డుపై ప్రయాణించే వారి భద్రత అత్యంత ముఖ్యమైనదని పేర్కొన్నారు. ఏ పరధ్యానం కూడా ప్రాణానికి విలువైనపెద్దది కాదని, ప్రతి ఒక్కరూ రోడ్డుపై భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్షణిక అవసరాల కోసం ప్రాణాలు పోగొట్టుకోవద్దని ఎక్స్ వేదికగా సూచించారు.

# తొక్కిసలాట మృతుల కుటుంబాలకు విజయ్ వీడియో కాల్

**బలగం టీవీ, చెన్నై**

తమిళనాడులోని కరూరులో టీవీకే చీఫ్ విజయ్ ర్యాలీలో గత నెల 27న చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మృతుల కుటుంబాలతో విజయ్ వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. ఆత్మీయులను కోల్పోయి దుఃఖంలో ఉన్న వారిని ఓదార్చి, త్వరలోనే వారిని స్వయంగా కలుస్తానని హామీ ఇచ్చారు.



# బస్ ఛార్జీల పెంపునకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

**బలగం టీవీ, హైదరాబాద్**

బస్సు చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం మంగళవారం నిరసన తెలిపింది. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి అసెంబ్లీ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి నిరసన తెలిపారు. ప్రయాణికులతో మాట్లాడుతూ బస్ ఛార్జీల పెంపుతో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ "మహిళలకు ఉచితంగా ప్రయాణం ఇచ్చి, పురుషుల దగ్గర చార్జీలు పెంచి వసూలు చేయడం అన్యాయం. బస్ ఛార్జీల పెంపుతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. ఇప్పటికే విద్యార్థుల బస్‌పాస్ రేట్లు కూడా పెంచారు. మార్పు అంటే ప్రజలపై భారం మోపడమేనా?" అని ప్రశ్నించారు. అలాగే, "మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చింది. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారు" అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ సామాన్య ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

# భక్తులకు ఇబ్బంది కలగకుండా పనులు పూర్తి చేయాలి



- **ప్రణాళిక ప్రకారం రాజన్న ఆలయ విస్తరణ పనులు చేపట్టాలి..**
- **కలెక్టర్ ఎం. హరిత**

**బలగం టీవీ, వేములవాడ**

రాజన్న భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా,ప్రణాళిక ప్రకారం రాజన్న ఆలయ విస్తరణ పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు. మంగళవారం శ్రీ రాజరాజేశ్వర స్వామి ని కలెక్టర్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం కళ్యాణ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు కలెక్టర్ కు ఆశీర్వచనం చేశారు. వఆలయ ఈఓ రమాదేవి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న కట్టడాల కూల్చివేత పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

అనంతరం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం విస్తరణ, అభివృద్ధిపై ఆలయ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ విస్తరణ, అభివృద్ధిపై రూపొందించిన నమూనాను కలెక్టర్ కు క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి విపులంగా వివరించారు. ప్రస్తుతం ఉన్న భవనాల కూల్చివేత పనులు, ప్రణాళిక ప్రకారం చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఎం. హరిత మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులకు వీటీఏడీఏ ఆద్వర్యంలో శ్రీకారం చుట్టిందని అన్నారు. ఆలయ విస్తరణకు పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రోజూ వారీగా చేపట్టే పనుల వివరాలు ఇవ్వాలని,నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రతి రోజూ ముఖ్యమేనని, ఒక్కరోజు కూడా వృథా చేయకుండా పనులు కొనసాగించాలని అన్నారు.

వచ్చే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు ముందు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెలలో శృంగేరి పీఠాధిపతులు రానున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని అన్నారు.

**భీమేశ్వర ఆలయంలో క్షేత్ర స్థాయిలో పరిశీలన**

భీమేశ్వర ఆలయంలో భక్తుల సౌకర్యార్థం అభిషేకం, అన్న పూజ, కోడె క్యూలైన్లో, కౌంటర్స్, ప్రసాదం తయారీ విభాగం ,నిత్య కళ్యాణము, సత్యనారాయణ వ్రతం మండపంతోపాటు పలు ప్రదేశాలను ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి, ఆర్ అండ్ బీ ఈఈ నరసింహ చారి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, వీటీఏడీఏ సెక్రటరీ అన్సార్, ఆలయ అర్చకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర అందరికి ఆదర్శం..

- **జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని, మంగళవారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి జయంతి సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఒక సామాన్య వ్యక్తిగా పుట్టి, బోయవాణిగా జీవితం గడిపి, సప్తర్షుల బోధనలతో మహర్షిగా మారి ఆదికావ్యం రామాయణం అనే అమరగ్రంథాన్ని మనకు అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి ప్రతి ఒక్కరికి స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. “కృషి, నిబద్ధత ఉంటే మనుషులు ఋషులవుతారు, మహాపురుషులవుతారు. దీనికి వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిలువెత్తు నిదర్శనం” అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు రవి, నాగేశ్వరరావు, ఆర్.ఐ రమేష్, ఏ. ఓ పద్మ,జిల్లా పోలీసు అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## మైనార్టీ అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం

- **డాక్టర్ దాసోజు శ్రావణ్**

**బలగం టీవీ, హైదరాబాద్**



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్ సత్యా కాలనీలో మైనార్టీ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రావణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశం డివిజన్ అధ్యక్షుడు దుర్గం ప్రదీప్ ఆధ్వర్యంలో, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఘౌస్, శ్రీ చంద్ భాయ్ సమన్వయంతో నిర్వహించబడింది. సభలో నేతలు మాట్లాడుతూ, కె.సి.ఆర్ నాయకత్వంలో మైనార్టీ వర్గాల అభివృద్ధి కోసం చేపట్టిన శాదీ ముబారక్, రంజాన్ తోఫా, ఫీ రీయింబర్స్‌మెంట్, మౌలాలకు నెలకు రూ.5000 మంజూరు వంటి పథకాల ద్వారా మైనార్టీల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో విప్లవాత్మక మార్పు చోటుచేసుకుందని వివరించారు. సత్యా కాలనీ ప్రాంత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణు వర్ధన్ రెడ్డి, చార్మినార్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన సలాహుద్దీన్ లోధీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోహైల్ ఖాన్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ మసిఉల్లా ఖాన్, ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు.

## విధులను బహిష్కరించిన న్యాయవాదులు

**బలగం టీవీ, కోరుట్ల**

సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై సోమవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, కోరుట్లలో న్యాయవాదులు మంగళవారం తమ విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరి విజయ్‌కుమార్ మాట్లాడుతూ, “సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి, భారత న్యాయ వ్యవస్థపైనే జరిగిన దాడి అని మేము భావిస్తున్నాము. ఇది దేశ న్యాయ చరిత్రలో ఒక చీకటి రోజు” అని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య న్యాయ వ్యవస్థకు మేలు చేయవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ ఫసియుద్దీన్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కడకుంట్ల సదాశివ రాజు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఊరడి నరేందర్, రాసభక్తుల రాజశేఖర్, సీనియర్ న్యాయవాదులు మచ్చ వెంకట రమణమూర్తి, బద్ది నర్సయ్య, సంగ విజయ్, బూరుగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పాలనలో మైనారిటీలకు అన్యాయం..

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మైనారిటీ నేతలైన మషీయుల్లా ఖాన్, ఆజం అలీ సోహయిల్, అర్షద్ అలీ ఖాన్లు మీడియా సమావేశం నిర్వహించి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల పట్ల పగబట్టినట్టుగా వ్యవహరిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, మైనారిటీ సంక్షేమ పథకాలను నిర్లక్ష్యం చేస్తోందని వారు విమర్శించారు.

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇమామ్‌లు, మౌజంల గౌరవ వేతనాన్ని నెలకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిందని, అయితే పది వేలకు పెంచకపోగా, ఉన్న రూ. 5 వేలను కూడా 3 నెలలకోసారి ఇస్తున్నారని, చాలా చోట్ల 3 నెలల వేతనం పెండింగ్‌లో ఉందని నేతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మైనారిటీ విద్యార్థులకు ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. షాదీ ముబారక్.. రేవంత్ రెడ్డి ఎన్నికల సభల్లో లక్ష రూపాయలకు తోడు తులం బంగారం ఇస్తామని ఊదరగొట్టారని, కానీ తులం బంగారం ఇవ్వడం లేదని, లక్ష రూపాయల చెక్కులు కూడా ఆలస్యం అవుతున్నాయని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లో ఒక దర్గా, రెండు స్మశాన వాటికలను కూల్చిన అధికారులపై ఇప్పటికీ చర్యలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చిన దర్గాను పదిహేను రోజుల్లో తిరిగి నిర్మిస్తామని కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రంలో మతకలహాలు పెరిగిపోయాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. రేవంత్ రెడ్డి బీజేపీకి మిత్రుడిగా, మైనార్టీలకు శత్రువుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ నిజమైన సెక్యులర్‌గా శాంతిభద్రతలను కాపాడారని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో మైనారిటీలకు సంబంధించిన ఏ సమస్యలనైనా వెంటనే పరిష్కరించేవారని, కేసీఆర్ ఇచ్చిన పథకాలను కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయలేకపోతోందని నేతలు పేర్కొన్నారు. జూబ్లీ హిల్స్ ముస్లిం ఓటర్లకు కేసీఆర్ చేసిన మంచి ఏమిటో, రేవంత్ రెడ్డి చేసిన చెడు ఏమిటో తెలుసన్నారు. ఉపఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే మైనార్టీలకు న్యాయం జరుగుతుందని వారు పిలుపునిచ్చారు.

## రైస్ మిల్లర్లు నిబంధనలకనుగుణంగా ముందుకెళ్లాలి..

- **జిల్లా కలెక్టర్ ఎం. హరిత**
- **ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో జిల్లాలో వరి ధాన్యం సేకరణ, బ్యాంక్ గ్యారెంటీ, సీఎంఆర్ సరఫరా తదితర అంశాలపై జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఎం హరిత మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రైస్ మిల్లర్లు సీఎంఆర్ సరఫరా చేయాలని ఆదేశించారు. గత ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. ఈ నెల మూడో వారంలో జిల్లాలో వరి కోతలు మొదలు కానున్నాయని తెలిపారు. ఈ సీజన్లో జిల్లాలో దాదాపు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానున్నదని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లులకు ధాన్యం కేటాయిస్తామని స్పష్టం చేశారు.

పలువురు రైస్ మిల్లర్ల అసోసియేషన్ నుంచి సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎఫ్సీఐకి బియ్యం ఇచ్చేందుకు బెడ్స్ ఇప్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కు విన్నవించగా, ప్రభుత్వ నిబంధవల ప్రకారం మిల్లర్లకు సహకరిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాష్, డీఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ నాగపూర్-హైదరాబాద్ హైస్పీడ్ కారిడార్ అభివృద్ధికి డీపీఆర్ నమూనా..

- **వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్**
- **హాజరైన జిల్లా కలెక్టర్ ఎం. హరిత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మహారాష్ట్ర- తెలంగాణ రాష్ట్రాల్లో విజన్ 2047 లో భాగంగా జాతీయ రహదారుల మాస్టర్ ప్లాన్ కింద నాగపూర్ నుంచి హైదరాబాద్ వరకు హై స్పీడ్ కార్ అభివృద్ధికై డిపిఆర్ నమూనా రూపొందించే విషయమై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ సమీక్షించారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహారాష్ట్ర- తెలంగాణ రాష్ట్రాల్లో విజన్ 2047 లో భాగంగా జాతీయ రహదారుల మాస్టర్ ప్లాన్ కింద నాగపూర్ నుంచి హైదరాబాద్ వరకు హై స్పీడ్ కార్ అభివృద్ధి కోసం డిపిఆర్ నమూనా సిద్ధం చేసే విషయంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా నుంచి కలెక్టర్ ఎం. హరిత హాజరయ్యారు.

నాగపూర్ నుంచి హైదరాబాద్ వరకు నేషనల్ హైవే అభివృద్ధి డిపిఆర్ నమూనాలో భాగంగా ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్,రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌తో సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టు ప్రకటన

## వన్డేలకు మార్ష్ నాయకత్వం

**బలగం టీవీ, సిడ్నీ**

భారత్ పర్యటనకు ఆస్ట్రేలియా తమ వన్డే, టీ20 జట్లను ప్రకటించింది. గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోని ప్యాట్ కమిన్స్‌ను ఈ సిరీస్ నుంచి తప్పించారు. ఆయన స్థానంలో మిచెల్ మార్ష్ వన్డే మరియు టీ20 జట్లకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. భారత్–ఆస్ట్రేలియా వన్డే సిరీస్ అక్టోబర్ 19న ప్రారంభం కానుంది. మొత్తం మూడు వన్డేలు, ఐదు టీ20లు జరగనున్నాయి.




ఆస్ట్రేలియా వన్డే జట్టులో కొంత మార్పులు చేసింది. మానస్ లబుషేన్ స్థానంలో మాథ్యూ రెన్‌షాకి చోటు కల్పించింది. రెన్‌షా ఇప్పటి వరకు 14 టెస్టులు ఆడినప్పటికీ, వన్డేల్లో ఇప్పటివరకు అరంగేట్రం చేయలేదు. గత సీజన్‌లో క్వీన్స్‌ల్యాండ్ తరపున అతను అద్భుత ప్రదర్శన చేసి, 50 సగటుతో 350 పరుగులు చేశాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో 80, 106, 62 పరుగులు సాధించి ఫామ్‌లో ఉన్నాడు.

### ప్రధాన బౌలర్లు స్టార్క్, హేజిల్‌వుడ్

కెప్టెన్ కమిన్స్ గైర్హాజరీలో బౌలింగ్ దళాన్ని మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ నడిపించనున్నారు. వీరికి తోడుగా గ్జావియర్ బార్ట్‌లెట్, బెన్ డ్వార్షియస్ లాంటి యువ బౌలర్లు ఉన్నారు.

మణికట్టు శస్త్రచికిత్స కారణంగా గ్లెన్ మ్యాక్స్‌వెల్ టీ20 సిరీస్ నుంచి తప్పుకున్నాడు. తొలి రెండు టీ20లకే ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. అక్టోబర్ 15న ఓవల్‌లో జరగనున్న షీఫీల్డ్ షీల్డ్ మ్యాచ్‌లో పాల్గొనడం వల్ల అలెక్స్ క్యారీ మొదటి వన్డేకు దూరమవనున్నాడు.

**ఆస్ట్రేలియా వన్డే జట్టు:**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), గ్జావియర్ బార్ట్‌లెట్, అలెక్స్ క్యారీ, కూపర్ కెనోలీ, బెన్ డ్వార్షియస్, నాథన్ ఎల్లిస్, కెమరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మిచెల్ ఓవెన్, మాథ్యూ రెన్‌షా, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జాంపా.

**ఆస్ట్రేలియా టీ20 జట్టు**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), సీన్ అబాట్, గ్జావియర్ బార్ట్‌లెట్, టిమ్ డేవిడ్, బెన్ డ్వార్షియస్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహనెమన్, మిచెల్ ఓవెన్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జాంపా.

# హీథర్ నైట్ వీరోచిత ఇన్నింగ్స్

- **ఇంగ్లండ్ విజయం**

**బలగం టీవీ, హైదరాబాద్**



వరల్డ్‌కప్‌లో వరుసగా ఏకపక్షంగా ముగిసిన మ్యాచ్‌లతో విసుగు చెందిన అభిమానులకు ఇంగ్లండ్–బంగ్లాదేశ్ మ్యాచ్ ఉత్కంఠభరిత అనుభూతినిచ్చింది. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఒకదశలో కష్టాల్లో పడ్డ ఇంగ్లండ్‌ను కెప్టెన్ హీథర్ నైట్ (79 నాటౌట్) ఒంటిచేత్తో గెలిపించింది.బంగ్లా బౌలర్లు మరుఫా అక్తర్ (2/28), మహిమా (3/16)లు ఇంగ్లండ్ టాప్ ఆర్డర్‌ను దెబ్బతీశారు. ఒక దశలో 30 ఓవర్ల లోపే మ్యాచ్ ముగుస్తుందనిపించింది. అయితే నైట్ చార్లీ డీన్ (27 నాటౌట్)తో కలిసి హాఫ్ సెంచరీ భాగస్వామ్యం కట్టి జట్టును విజయ తీరాలకు చేర్చింది. ఆరు వికెట్లు కోల్పోయినా ఇంగ్లండ్ 4 వికెట్ల తేడాతో ఉత్కంఠ భరిత విజయం సాధించింది.

ఇదే ముందు దక్షిణాఫ్రికాను 69 పరుగులకే కట్టడి చేసిన ఇంగ్లండ్, బంగ్లాదేశ్ నిర్దేశించిన 179 పరుగుల లక్ష్య ఛేదనలో మాత్రం బాగా తడబడింది. గువాహటి వేదికగా ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఈ పోరులో బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించే అవకాశాన్ని చేజార్చుకుంది.కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ (32) సహా ప్రధాన బ్యాటర్లు పెవిలియన్ చేరగా, నైట్ మాత్రం స్థిరంగా ఆడింది. ఆమె చెలరేగిన బౌండరీలతో బంగ్లా ఆశలపై నీళ్లు చల్లింది. మ్యాచ్ ఆరంభంలోనే మరుఫా అక్తర్ తన సూపర్ డెలివరీతో ఇంగ్లండ్ ఓపెనర్ అమీ జోన్స్ (1)ను ఎల్బీగా వెనక్కి పంపింది. ఆ తర్వాత నహిదా అక్తర్ బంతికి టమ్మీ బ్యూమాంట్ (7) ఔటయ్యే అవకాశం వచ్చినా క్యాచ్ మిస్సవడంతో బంగ్లాకు కీలక బ్రేక్ మిస్సయింది. అంతిమంగా హీథర్ నైట్ ధైర్యవంతమైన బ్యాటింగ్ ఇంగ్లండ్‌ను వరల్డ్‌కప్‌లో రెండో వరుస విజయానికి దారి తీసింది.

ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి టాపార్డర్ విఫలం కాగా బంగ్లాదేశ్ స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. ఇంగ్లిష్ స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొన్న శోభన మొస్త్రే(60) అర్ధ శతకంతో రాణించింది. ఆఖర్లో రబెయా ఖాన్(43) మెరుపులతో బంగ్లా కోలుకుంది. స్మిత్ వేసిన చివరి ఓవర్లో రబెయా సిక్స్, ఫోర్ బాది హాఫ్ సెంచరీకి చేరువైంది. కానీ, షజిందా అక్తర్ ఔట్ కావడంతో 178కే బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ముగిసింది.

# రోహిత్ శర్మపై మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ ప్రశంసల జల్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపై మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ ప్రశంసల జల్లు కురిపించాడు. పెద్ద మ్యాచ్‌లు ఎలా గెలవాలో టీమిండియాకు రోహిత్ శర్మ నేర్పించాడని కొనియాడాడు. వన్డే సారథ్య బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించిన నేపథ్యంలో తన ఫేస్‌బుక్ వేదికగా మాట్లాడిన దినేశ్ కార్తీక్.. రోహిత్ సేవలను కొనియాడాడు. రోహిత్ శర్మ గొప్ప సారథి అని చెప్పుకొచ్చాడు.'రోహిత్ శర్మకు థ్యాంక్స్. మీరు వ్యూహాత్మకంగా చతురత కలిగిన అద్భుతమైన కెప్టెన్. ఎంతో స్నేహపూర్వకంగా ఉన్నారు. అందరిని కలుపుకుపోయారు. ఆటగాళ్లు ఎలాంటి ఒత్తిడి లేకుండా సౌకర్యంగా ఉండేలా చేశారు. పెద్ద టోర్నీల్లో అతి ముఖ్యమైన మ్యాచ్‌ల్లో గెలవడానికి ఏమి అవసరమో ప్రస్తుత జట్టుకు నేర్పించావు. కొన్నిసార్లు మేము వెనక్కి తగ్గేవాళ్లం. కానీ నువ్వు మాత్రం మమ్మల్ని ప్రోత్సహించేవాడివి. మరింత ముందుకు సాగి, ప్రత్యర్థిపై ఒత్తిడి తేవాలని, టైటిల్ వదిలేయకూడదని చెప్పేవాడివి.పెద్ద మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా మరింత బాధ్యత తీసుకొని బ్యాటింగ్ చేశావు. మనం ఆడిన చివరి 3 పెద్ద టోర్నీల్లో భారత ఒక మ్యాచ్ మాత్రమే ఓడింది. 2024 టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీలో అజేయంగా ముందుకు సాగాం. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో మాత్రమే ఓడాం. అదే జోరు ఇప్పుడూ కూడా చూస్తున్నాం. ఇటీవల యువ జట్టు ఆసియా కప్ గెలిచింది. ఆ స్ఫూర్తి మీరు అందించినదే. కెప్టెన్‌గా మీరు బాధ్యతలు చేపట్టినప్పటి కంటే జట్టును మెరుగైన స్థానంలో ఉంచారు. అది గొప్ప నాయకుడి లక్షణం.'అని దినేశ్ కార్తీక్ చెప్పుకొచ్చాడు. అక్టోబర్ 19 నుంచి టీమిండియా ఆస్ట్రేలియా పర్యటన ప్రారంభం కానుంది. మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్‌ల కోసం భారత్ అక్కడికి వెళ్లనుంది. నవంబర్ 8 వరకు కొనసాగే ఈ పర్యటనలో ముందుగా వన్డేలు.. ఆ తర్వాత టీ20 సిరీస్ జరగనుంది. ఇప్పటికే ఈ పర్యటనకు సంబంధించిన జట్లను భారత సెలెక్టర్లు ప్రకటించారు.టీమిండియా వన్డే సారథ్య బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించి శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా, శ్రేయస్ అయ్యర్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. వన్డే ప్రపంచకప్ 2027 నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కెప్టెన్సీ కోల్పోయినా ఆటగాడిగా రోహిత్ శర్మ జట్టులో చోటు దక్కించుకున్నాడు. విరాట్ కోహ్లీ కూడా రీఎంట్రీ ఇచ్చాడు. రవీంద్ర జడేజాపై వేటు వేసిన సెలెక్టర్లు నితీష్ కుమార్ రెడ్డికి అవకాశం కల్పించారు. సిరాజ్ వన్డే టీమ్‌లోకి రీఎంట్రీ ఇవ్వగా.. బుమ్రాకు రెస్ట్ ఇచ్చారు. ఆసియా కప్ 2025లో అసాధారణ ప్రదర్శన కనబర్చిన తిలక్ వర్మ.. టీ20లకే పరిమితమయ్యాడు.

# పీవీఎల్‌లో కోల్‌కత థండర్‌బోల్ట్స్ విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్ లో కోల్‌కత థండర్‌బోల్ట్స్ అదరగొట్టింది. మంగళవారం హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో కోల్‌కత థండర్‌బోల్ట్స్ 3–1 (12–15, 15–13, 15–6, 19–17)తో కొచ్చి బ్లూ స్పైకర్స్‌పై అద్భుత విజయం సాధించింది. సర్వ్, స్పైక్స్‌లో రెచ్చిపోయిన కోల్‌కత థండర్‌బోల్ట్స్ సీజన్లో బోణీ కొట్టింది. కోల్‌కత విజయంలో కీలక పాత్ర పోషించిన పంకజ్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. కొచ్చి బ్లూ స్పైకర్స్ ఆటగాడు హేమంత్ పవర్‌ఫుల్ సర్వీసులతో మెరువగా ఆ జట్టు మ్యాచ్‌ను దూకుడుగా మొదలెట్టింది. ఇరు జట్ల డిఫెన్స్ పటిష్టంగా ఉండటంతో పాయింట్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. కొచ్చి సెట్టర్ బైరాన్ తెలివైన పాస్‌లతో కోల్‌కతను ఒత్తిడిలోకి నెట్టి తొలి సెట్‌లో సొంతం చేసుకునేలా చేశాడు. రెండో సెట్ నుంచి కోల్‌కత అసలు ఆట మొదలుపెట్టింది. కెప్టెన్ అశ్వల్ రాయ్, పంకజ్ శర్మ పదునైన స్పైక్‌లతో కొచ్చి కోర్టులో అలజడి సృష్టించారు. అభిషేక్ సూపర్ సర్వ్‌తో ఆకట్టుకున్నా అనవసర తప్పిదాలు కొచ్చి జట్టుకు ప్రతికూలంగా మారాయి. కొచి తప్పిదాలను సొమ్ముచేసుకున్న కోల్‌కత రెండో సెట్‌ను ఖాతాలో వేసుకుంది. మూడో సెట్‌లో కోల్‌కత పూర్తి ఆధిపత్యం చెలాయించింది. మిడిల్ జోన్‌లో మాటిన్ అద్భుతంగా రాణించడంతో కొచ్చి తేలిపోయింది. ఈ సెట్‌ను కోల్‌కతా 15–6తో సునాయాసంగా కైవసం చేసుకుంది. నాలుగో సెట్ నువ్వానేనా అన్నట్టు సాగింది. కొచ్చి చివరి వరకు పోరాడినప్పటికీ, కీలక సమయంలో మాటిన్ అద్భుతమైన బ్లాక్‌తో కోల్‌కతాకు 19–17తో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కూడా అందించాడు.

# భారీ రన్‌టైంతో బాహుబలి ఎపిక్

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు సినిమాను ప్రపంచానికి పరిచయం చేసిన ఐకానిక్ బ్లాక్ బస్టర్ సినిమా 'బాహుబలి' మళ్లీ రీ రిలీజ్ కాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఇటీవల 10 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మూవీ రీ రిలీజ్‌ను అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ సినిమా (బాహుబలి: ది ఎపిక్) అనే పేరుతో రెండు భాగాలను ఒకే పార్ట్‌గా అక్టోబర్ 31, 2025న ప్రపంచవ్యాప్తంగా రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడటంతో రీ ఎడిటింగ్ పనులు దగ్గరుండి చూసుకుంటున్నాడు దర్శకుడు




రాజమౌళి. మరోవైపు ఈ సినిమా రన్‌టైంకి సంబంధించి క్లారిటీనిచ్చాడు నిర్మాత శోభు యార్లగడ్డ. ఈ సినిమా రన్‌టైం మొదట 5 గంటల 27 నిమిషాలు అని టాక్ వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై శోభు మాట్లాడుతూ.. బాహుబలి: ది ఎపిక్ 3 గంటల 40 నిమిషాల రన్‌టైం(అటు ఇటుగా)తో రాబోతున్నట్లు ప్రకటించాడు. అలాగే బాహుబలి పార్ట్ 1 ముగిశాక ఇంటర్వెల్ ఉంటుందని ఇంటర్వెల్ అనంతరం పార్ట్ 2 స్టార్టవుతుందని శోభు తెలిపాడు.

# ప్రియదర్శి మిత్ర మండలి ట్రైలర్ విడుదల




**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ నటుడు ప్రియదర్శి మరో కొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. గీతా ఆర్ట్స్ 2 బాధ్యతల నుంచి విరామం తీసుకున్న నిర్మాత బన్నీ వాస్, తన సొంత బ్యానర్ బన్నీ వాస్ వర్క్స్‌ని ప్రారంభించి, దానిలో మొదటి సినిమాగా మిత్రమండలి అనే సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. బన్నీ వాసు ఈ సినిమాను సమర్పిస్తుండగా.. సప్త అశ్వ మీడియా వర్క్స్ మరియు వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

ప్రియదర్శి కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ నిహారిక %ఎన్‌ఎం% కథానాయికగా నటించబోతుంది. ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాతో ఎస్ విజయేంద్ర దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. ఆర్ఆర్ ధ్రువన్ సంగీతం అందించబోతున్నాడు. ఈ సినిమా బ్యాండ్ ట్రూప్ నేపథ్యంలో రాబోతున్నట్లు తెలుస్తుంది.

# 10న థియేటర్లకు మటన్ సూప్

**బలగం టీవీ, హైదరాబాద్**



డిఫరెంట్ కథా కథనాలతో రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో, హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కించిన చిత్రం 'మటన్ సూప్'. 'విట్‌నెస్ ది రియల్ క్రైమ్' అనేది ట్యాగ్ లైన్. రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై మల్లిఖార్జున ఎలికా (గోపాల్), రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 10న థియేటర్లోకి రానుంది. ఈ క్రమంలో మంగళవారం మేకర్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ వశిష్ట ముఖ్య అతిథిగా విచ్చేసి, ట్రైలర్‌ను లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మటన్ సూప్' టైటిల్ చాలా బాగుంది. ట్రైలర్ బాగుంది. ట్రైలర్ ఎంత బాగుందో.. సినిమా కూడా అంత పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'నాకు ఈ ప్రయాణంలో తోడుగా నిలిచిన నిర్మాతలకు థ్యాంక్స్. అందరూ మా చిత్రాన్ని చూసి సపోర్ట్ చేయండి' అని రామచంద్ర వట్టికూటి అన్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ, 'ఈ సినిమాని నేను చూశాను. చాలా అద్భుతంగా ఉంది. ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. నిర్మాత మల్లిఖార్జున ఎలికా మాట్లాడుతూ, 'మా అమ్మ కలను ఆడియెన్స్ ముందుకు ఈనెల 10న తీసుకు వస్తున్నాం' అని చెప్పారు. 'మన చుట్టూ జరిగే కథల్నే అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రామచంద్ర చూపించారు' అని మరో నిర్మాత రామకృష్ణ సనపల తెలిపారు.